సాక్షి నిర్మల్

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



ఆనందంగా రక్షాబంధన్

జిల్లా వ్యాప్తంగా రాఖీ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. అక్కాచెల్లెళ్లు అన్నాతమ్ముళ్లకు రాఖీ కట్టి అనుబంధాన్ని చాటుకున్నారు.

9లో▸



మంత్ర సహిత చండీహోమం

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో గురువారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా చతుర్వేద సరస్వతీ మంత్ర సహిత చండీహోమం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు జరిపించారు.

గరిష్టం/కనిష్టం
33.0 /25.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. జిల్లాలో పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రాజీమార్గమే మేలు



మాట్లాడుతున్న జడ్జి జితిన్‌కుమార్

ఖానాపూర్: రాజీమార్గమే రాజమార్గమని ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ సూచించారు. గురువారం పట్టణంలోని కోర్టులో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 1నుంచి 9వ తేదీ వరకు ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల రాజీ విషయమై నిర్వహించనున్న మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. డ్రంకెన్‌డ్రైవ్, రోడ్డు ప్రమాదాలు, కోవిడ్ సమయంలో నమోదైన మాస్క్ కేసులను సత్వరమే పరిష్కరించుకునే అవకాశం ఉందని సూచించారు. ఏపీపీ రామకృష్ణ, సీఐ మోహన్, ఎస్సైలున్నారు.

కిక్‌బాక్సింగ్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలోగల ఖేల్గాంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. పోటీల్లో 26 రాష్ట్రాలకు చెందిన 3,500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి 95 మంది కిక్ బాక్సర్స్ పాల్గొనగా.. వీరిలో జిల్లాకు చెందిన 15మంది ఉన్నారు. వీరిలో ఐదుగురు పతకాలు సాధించారు. కరికేల్లి దివ్య (13–15 ఏళ్లు) పాయింట్ ఫైట్ (35 కేజీలు) విభాగంలో బంగారు పతకం, మాటేగమ్ అక్షయ పాయింట్ ఫైట్ (50 కేజీలు) విభాగంలో కాంస్య పతకం, మురళి అంకిత కిక్ లైట్ (40 కేజీలు) విభాగంలో కాంస్య పతకం, కర్కురి నాగలక్ష్మి లైట్ కాంటాక్ట్ (45 కేజీలు) విభాగంలో రజత పతకం, దవ మనీషా కిక్ లైట్ (30కేజీల) విభాగంలో రజత పతకం సాధించారు. వీరిని జిల్లా కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు రామాంజనేయులు, మాస్టర్స్ మృణాళిని, సాయికృష్ణ, శివరాజ్‌గౌడ్, శ్రీకాంత్, మనీషా, చిరంజీవి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు.

మిషన్ భగీరథపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న జ్ఞాన్‌కుమార్, అధికారులు

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మిషన్ భగీరథ అధికారులకు సీఈ జ్ఞాన్‌కుమార్ అవగాహన కల్పించారు. ఇటీవల వీఆర్‌ఏలను రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో సర్దుబాటు చేయగా ఇందులో పలువురు మిషన్ భగీరథ పథకంలో గ్రామస్థాయి అధికారులుగా నియమించబడ్డారు. గురువారం మండలంలోని తిర్పెల్లి గ్రామంలో వీరికి మిషన్ భగీరథ సీఈ జ్ఞాన్‌కుమార్ అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్‌ట్యాంక్ వద్ద వారు నిర్వర్తించాల్సిన విధులను ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రాజేశ్వర్, మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, ఏఈఈ క్రాంతికుమార్, ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీనివాస్, శివ, ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తం బాలేరావ్‌కు పురస్కారం



బాలేరావ్‌కు పురస్కారం ఇస్తున్న సచిన్‌భావు సాఠే

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, అన్నాభావు సాఠే జిల్లా అధ్యక్షుడు ఉత్తం బాలేరావ్‌కు సాహిత్యరత్న జన్మభూమి పురస్కారం లభించింది. ఆదిలాబాద్ జిల్లా ముఖరా (కే) గ్రామంలో బుధవారం అన్నాభావు సాఠే జయంతి ఉత్సవాలకు అన్నాభావు సాఠే తనయుడు సచిన్ బావు సాఠే హాజరయ్యారు. కాగా, ఉత్తం బాలేరావ్ నాలుగేళ్లుగా నిర్మల్ జిల్లాలోని ఆయా గ్రామాల్లో నిర్వహించే అన్నాభావు సాఠే జయంతి ఉత్సవాల్లో పాల్గొని సాఠే జీవితచరిత్ర వివరిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అతడి సేవలను గుర్తించి అన్నాభావు సాఠే తనయుడు సచిన్ సాఠే చేతుల మీదుగా పురస్కారం అందించారు.

ఎలమంద కోసం ఎదురుచూపు

- రెండో విడత పంపిణీ వాయిదా
- 7,274 యూనిట్లకు 327 పంపిణీ
- నిధులు లేకే అంటున్న ప్రతిపక్షాలు
- ఐదేళ్లుగా నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



నిర్మల్‌చైన్‌గేట్: రెండోవిడత సబ్సిడీ గొర్రెల యూనిట్ల కోసం లబ్ధిదారులు ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. గొల్లకురుమలను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు రాష్ట్రంలో మాంసాహార ఉత్పత్తిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2017లో సబ్సిడీ గొర్రెల యూనిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. పథకాన్ని రెండు విడతలుగా అమలు చేయాలని నిర్ణయించింది. మొదటి విడతలో 50శాతం, రెండో విడతలో 50శాతం యూనిట్లు పంపిణీ చేసేలా ప్రణాళిక రూపొందించింది. సొసైటీలుగా ఏర్పడి, సభ్యులుగా నమోదై 18 ఏళ్లు నిండిన గొల్లకురుమలను అర్హులుగా గుర్తించింది. గొర్రెల కాపరులు తమ వాటాగా 25 శాతం డబ్బులు చెల్లిస్తే.. ప్రభుత్వ 75శాతం నిధులు కలెక్టర్ ఖాతాలో జమచేసి జీవాలు కొనుగోలు చేసి గొల్లకురుమలకు అందజేస్తోంది.

నిధుల లేమే కారణమా?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సబ్సిడీ గొర్రెల పంపిణీ ఆగుతూ.. సాగుతోంది. రెండో విడత పంపిణీకి జీవాలు దొరకడం లేదని చెబుతూ కార్యక్రమాన్ని వాయిదా వేస్తూ వస్తోంది. నిధుల లేమితోనే పంపిణీ నిలిచిపోయిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఏదేమైనా రెండో విడత లబ్ధిదారులకు ఐదేళ్లుగా గొర్రెల కోసం నిరీక్షణ తప్పడంలేదు.

లక్ష్యం కొండంత.. ఇచ్చింది గోరంతే..

రెండో విడత గొర్రెల పంపిణీ వ్యవహారం ఇవ్వాల్సింది కొండంత.. ఇచ్చింది గోరంత.. అన్న చందంగా తయారైంది. ప్రభుత్వం పచ్చజెండా ఊపిందని గొల్లకురుమలు సంతోషించేలోపే కొత్త అడ్డంకులు వస్తున్నాయి. జూన్‌లో గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉండగా కొనుగోలుకు జీవాలు దొరకక కార్యక్రమం వాయిదా పడుతూ వచ్చింది. గొర్రెల కొనుగోలుకు ఇటీవల కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన అధికారులు, లబ్ధిదారులు ఉత్తి చేతులతో తిరిగివచ్చారు. తిరిగి జూలైలో పంపిణీ ప్రారంభించగా.. ఇప్పటివరకు 327 యూనిట్లు మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నారు. ప్రభుత్వం నిధులివ్వకపోవడంతోనే పంపిణీ నిలిచిందని.. గొర్రెలు దొరకడంలేదని అధికారులు చెబుతున్నదంతా అవాస్తవమని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

తొలి విడత పంపిణీ ఇలా..

గొర్రెల యూనిట్ల పంపిణీకి జిల్లాలో 2017 మే, జూన్‌లో ఒకేసారి మొదటి, రెండో విడత లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదటి విడత లక్ష్యం 7,148 కాగా, ఇప్పటివరకు 6,779 యూనిట్లు పంపిణీ చేశారు. ఇంకా 369 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఒక్కో యూనిట్ విలువ రూ.1.25 లక్షలు కాగా లబ్ధిదారులు వాటా కింద రూ.31,250 చెల్లించగా మిగతా రూ.93,750 సబ్సిడీగా ప్రభుత్వం ఇచ్చింది.

రెండో విడత ఇలా..

రెండో విడత లక్ష్యం 7,274 యూనిట్లు కాగా వీటిలో మార్చి వరకు 141 మాత్రమే పంపిణీ చేసి నిలిపివేశారు. దీంతో రెండో విడతకు ఎంపికైన 7,274 మంది లబ్ధిదారులు ఐదేళ్లుగా గొర్రెల యూనిట్ల కోసం ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ మార్చిలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రెండో విడతలో అందరికీ ఏప్రిల్ మొదటి వారం నుంచి ఆగస్టు నెలాఖరు వరకు యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించగా ఇప్పటివరకు విడతల వారీగా 327 మాత్రమే పంపిణీ చేశారు.

రాయితీ పెంచినా ఏం లాభం!

రెండో విడతలో గొర్రెల పంపిణీకి ఎంపికైన లబ్ధిదారులకు ఐదేళ్లుగా యూనిట్లు పంపిణీ చేయని ప్రభుత్వం యూనిట్ విలువతోపాటు రాయితీని పెంచింది. యూనిట్ విలువ రూ.1,75,000 కాగా, లబ్ధిదారుడి వాటా 25శాతం అనగా రూ.43,750 డీడీ తీసి ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. మిగతా రూ.1,31,250 సొమ్మును ప్రభుత్వమే భరించనుంది. అయితే జిల్లాలో రెండో విడత పంపిణీ ఏప్రిల్‌లో ప్రారంభించి ఆగస్టు వరకు పూర్తి చేయాల్సి ఉండగా ప్రక్రియ మందకొడిగా సాగుతోంది.

రెండో విడత కొనసాగుతోంది

జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటివరకు దాదాపు 700 మందికి పైగా డీడీలు చెల్లించారు. ఇందులో 327 మందికి గొర్రెల పంపిణీ పూర్తి చేశాం. డీడీలు చెల్లించిన వారందరికీ విడతలవారీగా పంపిణీ చేస్తాం.

– గంగాధరయ్య, ఇన్‌చార్జి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

రాజకీయాలపై ఆసక్తి

- వచ్చే ఎన్నికల్లో పోటీకి ఉత్సాహం
- విభిన్న రంగాల వ్యక్తులు, ఉద్యోగస్తులు కూడా పోటీకి సై అంటూ ముందుకు..
- పార్టీతో సంబంధం లేకున్నా టికెట్ కోసం అధిష్టానం వద్ద ప్రయత్నం
- రిజర్వ్‌డ్ నియోజకవర్గాలపై ఇతర జిల్లాలకు చెందిన నేతల గురి
- ఆసక్తి కలిగిస్తున్న పొలిటికల్ హైడ్రామా



సాక్షి, ఆదిలాబాద్: రాజకీయాల్లో అడుగు పెట్టేందుకు విభిన్న రంగాల ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. పార్టీలతో సంబంధం లేకున్నప్పటికీ తమకు టిక్కెట్ ఇస్తే చేరిపోతామంటున్నారు. ఉద్యోగ విరమణ చేసిన పలువురు ఉద్యోగులు పొలిటికల్‌లో అడుగుపెట్టేందుకు తహతహలాడుతున్నారు. కొందరు ఈ ఎన్నికలనే దృష్టిలో పెట్టుకొని ఉద్యోగ విరమణకు సమయం ఉన్నప్పటికీ ముందుగానే స్వచ్ఛందంగా కొలువుకు స్వస్తి పలికి నేతగా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ ఆయా నియోజకవర్గాల నుంచి పోటీకి ఆసక్తి కనబర్చే వారికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించగా కుప్పలుతెప్పలుగా వచ్చిపడ్డాయి. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో ఇతర జిల్లాల నేతలు పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అందులో పార్టీకి సంబంధించిన నాయకులతో పాటు పార్టీతో సంబంధం లేని విభిన్న రంగాల వ్యక్తులున్నారు.

విభిన్న రంగాల నుంచి..

కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో పలువురు డాక్టర్లు, అడ్వకేట్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిజినెస్ మెన్‌లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, రిటైర్డ్, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన వారు, వివిధ సంఘాల ద్వారా సామాజిక సేవలు చేస్తున్న వారు, యూత్ లీడర్లు ఉన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో ప్రైవేట్ వైద్యదంపతులు డీ శ్రీనివాస్, విద్యావర్ధిని, సింగరేణి ఏరియా వైద్యుడు దరఖాస్తు చేసుకున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి హైకోర్టు అడ్వకేట్ కే ఉదయ్‌కాంత్, మంచిర్యాల జిల్లాలో పనిచేస్తున్న ప్రైవేట్ వైద్యుడు వన్నెల అశోక్ బోథ్ నియోజకవర్గం నుంచి, ఖానాపూర్ నియోజకవర్గం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పరిశ్రమల శాఖాధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జాదవ్ రాంకిషన్ నాయక్ పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇటీవల ఆర్టీవో శాఖలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన శ్యాంనాయక్ ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి, ఆదిలాబాద్ నుంచి ఎన్ఆర్ఐ కంది శ్రీనివాసరెడ్డి, బోథ్ నియోజకవర్గం నుంచి ఆసిఫాబాద్‌లో ప్రభుత్వ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న తొడసం ధనలక్ష్మి, సెరికల్చర్ ఉద్యోగి రాథోడ్ పార్వతి దరఖాస్తు చేసుకున్నారు. ముధోల్ నియోజకవర్గం నుంచి డాక్టర్ కిరణ్‌కుమార్ కొమ్రేవార్ పోటీకి ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక బీజేపీలోనూ వివిధ నియోజకవర్గాల్లో విభిన్న రంగాలకు చెందిన వ్యక్తులు ఇప్పటికే టిక్కెట్‌కోసం ప్రయత్నం చేస్తున్నారు.

తుడుందెబ్బ నుంచీ ప్రయత్నాలు..

ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నాయకులు కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆసిఫాబాద్ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, బోథ్ నుంచి జిల్లా అధ్యక్షుడు గొడం గణేశ్, ఖానాపూర్ నుంచి జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు తమకు టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల నుంచి టిక్కెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

గోండుగూడలో పర్యటించిన ట్రెయినీ ఐఏఎస్‌లు



ఇంకుడుగుంత పరిశీలిస్తున్న ట్రెయినీ ఐఏఎస్‌లు

దస్తురాబాద్: మండలంలోని గోండుగూడ (జీ) గ్రామంలో గురువారం ట్రెయినీ ఐఏఎస్‌లు పర్యటించారు. పల్లె ప్రకృతివనం, డంప్‌యార్డు, హరితహారం నర్సరీ, పౌల్ట్రీఫాం, క్యాటిల్ షెడ్స్, డ్రైనేజీలు, ఇంకుడుగుంతలు, వాటర్‌ట్యాంకులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. మహిళలు సంఘాలుగా ఏర్పడి పాడి పరిశ్రమ, కూరగాయల సాగుపై దృష్టిసారించాలని సూచించారు. వీరి వెంట సర్పంచ్ సిడాం లక్ష్మి, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్, ఏపీవో రవిప్రసాద్, ఏపీఎం గంగన్న, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కడెం అడవుల సందర్శన

కడెం: దస్తురాబాద్ మండలంలోని గోండుగూడ గ్రామ పర్యటనకు గురువారం వచ్చిన ట్రెయినీ ఐఏఎస్‌లు కడెం అటవీ రేంజ్ పరిధిలో పర్యటించారు. కడెం ప్రాజెక్ట్ గుట్టపై ఉన్న వాచ్ టవర్, గంగాపూర్ వాచ్ టవర్ పైకి వెళ్లి ప్రకృతి అందాలు తిలకించారు. వారి వెంట ఎంపీవో ఉపేందర్, ఎఫ్ఆర్వో అనిత, అటవీ సిబ్బంది ఉన్నారు.

అర్చకులకు అండ



- వేతనం రూ.10వేలు చేస్తూ ఉత్తర్వులు
- జిల్లాలో 265 ఆలయాలకు అమలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అర్చకులు

నిర్మల్ చైన్‌గేట్: వెనుకబడిన ఆలయాలు, వీటిని నిర్వహించే అర్చకుల ప్రయోజనం కోసం రూపొందించిన ధూప దీప నైవేద్య పథకం నిధులు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ భవనాన్ని మే 31న సీఎం కేసీఆర్ ప్రారంభించిన సందర్భంగా ధూప దీప నివేదన పథకం నిధులను రూ.10 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇందులో రూ.6వేలు అర్చకుడికి గౌరవ వేతనంగా, ధూప దీప నివేదనకు రూ.4వేలుగా నిర్ణయిస్తూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ వీ అనిల్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పథకానికి ఆద్యుడు వైఎస్సార్

అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ధూప దీప నివేదన పథకాన్ని ప్రారంభించారు. పురాతన ఆలయాల్లో నిత్యం పూజలు నిర్వహించడంతోపాటు అర్చకులకు లబ్ధి జరిగేలా 2007లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. తొలుత నెలకు రూ.2,500 చొప్పున అందించగా, శిథిలావస్థలోని ఆలయాలు కొంత మేర పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయి.

జిల్లాలో 265 ఆలయాలు

జిల్లాలో మొదటి విడతలో 162 ఆలయాలకు ఈ పథకాన్ని వర్తింపజేశారు. మూడో విడతలో 162 ఆలయాలకు సంబంధించి దరఖాస్తులు రాగా 103 గుడులకు ఈ పథకాన్ని వర్తింపజేశారు. తెలంగాణ ఏర్పడ్డాక ధూప దీప నైవేద్యం (పడితరం) పథకం చెల్లింపులను రూ.6వేలకు పెంచారు. ప్రస్తుతం మరో రూ.4వేలు పెంచగా, రూ.10వేలకు చేరింది. ఇందులో ధూప దీప నివేదనకు రూ.4 వేలు, అర్చకుడి గౌరవ వేతనం రూ.6 వేలు అందనుంది.

ఆలయాలకు ఆదరణ



ధూప దీప నివేదన పథకంతో ఆలయాలకు ఆదరణ పెరిగే అవకాశం ఉంది. నిత్యం ఆలయాల్లో దీపం వెలిగించడం, నివేదన సమర్పించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించవచ్చు. డీడీఎన్ పథకం నగదును రూ.10 వేలకు పెంచడం సంతోషంగా ఉంది.

– ఎలుకూచి రాజేశ్వర్‌శర్మ, ఉమామహేశ్వర ఆలయం, సిద్దులకుంట

ప్రోత్సాహకం అభినందనీయం



ధూప దీప నైవేద్యం పథకం నగదును ప్రభుత్వం రూ.10 వేలకు పెంచడం అభినందనీయం. ఈ పథకం ద్వారా పురాతన ఆలయాలకు పూర్వవైభవం వస్తోంది. సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. ముఖ్యమంత్రి చొరవతోనే ప్రోత్సాహకం పెరిగింది.

– ప్రసాద్‌జోషి, హనుమాన్ టెంపుల్, కుభీర్

గొప్ప విషయం



ప్రభుత్వం ఆలయాలకు ఇస్తున్న ధూప దీప నైవేద్య పథకం డబ్బులు, అర్చకుల గౌరవ భృతిని పెంచినందుకు ఆనందంగా ఉంది. సీఎం కేసీఆర్ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయడం గొప్ప విషయం. ప్రభుత్వ నిర్ణయంతో ధర్మపరిరక్షణ జరుగుతోంది.

– సిర్గ రమేశ్‌శర్మ, డీడీఎన్ అర్చక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



కొనసాగుతున్న రెండో ఏఎన్ఎంల సమ్మె

నిర్మల్‌చైన్‌గేట్: తమను రెగ్యులర్ చేయాలని రెండో ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 25వ రోజుకు చేరింది. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని దీక్ష శిబిరంలో రెండో ఏఎన్ఎంలు సీఎం కేసీఆర్, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు రాఖీ కట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమను తోబుట్టువుల్లా భావించి రెగ్యులర్ చేయాలని వేడుకున్నారు. అనంతరం దీక్ష శిబిరంలోని ఒకరికొకరు రాఖీ కట్టుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

ఆలయ ఉద్యోగుల నిజాయతీ



భక్తురాలికి పర్సు ఇస్తున్న ఉద్యోగులు

భైంసా: బాసర శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు గురువారం బోధన్‌కు చెందిన ఓ భక్తురాలు వచ్చింది. ఆలయ ప్రాంగణంలో నగదుతో కూడిన పర్సు పోగొట్టుకుంది. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శివరాజ్‌దేశాయి, హోంగార్డు శ్రీనివాస్‌కు భక్తురాలి ఆమె పర్సు దొరికింది. దీంతో వారు బాధితురాలికి పర్సు అందజేసి నిజాయతీ చాటుకున్నారు.

ఇంటి నుంచే ఓటు

- దివ్యాంగులు, వృద్ధులకు ఉపయోగకరం
- వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా ఎన్నికల కమిషన్ చర్యలు
- కసరత్తు చేస్తున్న జిల్లా యంత్రాంగం

కైలాస్‌నగర్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం నూతన సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో వారికి అవసరమైన వసతులు కల్పిస్తోంది. ముఖ్యంగా ఈ ఏడాదిలో జరిగే ఎన్నికల్లో దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి నుంచే తమ ఓటుహక్కు వినియోగించుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానం విజయవంతం కావడంతో మన రాష్ట్రంలోనూ దాన్ని అమలు చేసేలా ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం పోలింగ్ కేంద్రాల వారీగా వయోవృద్ధులు, దివ్యాంగులను గుర్తించే పనిలో నిమగ్నమైంది.

రాజకీయ పార్టీల పాట్లు

దివ్యాంగులు, వయోవృద్ధులు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు గతంలో నానా తిప్పలు పడాల్సి వచ్చేది. వారి ఓట్లు రాబట్టుకునేందుకు వివిధ రాజకీయ పార్టీలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చేది. వారి ఓట్లను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు వారే స్వయంగా ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చేవారు. పార్టీలకు సంబంధం లేని వారు ఓటుహక్కును వినియోగించుకోవాలంటే ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాల్సి వచ్చేది. అక్కడి నుంచి తమ చేతులను స్ట్రెచర్లుగా మార్చుకుని పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లి ఓటు వేయించేవారు. ఇలాంటి పరిస్థితులను గమనించిన ఎన్నికల సంఘం వృద్ధులు, దివ్యాంగులు సైతం తమ ఓటును ప్రశాంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టింది. దివ్యాంగులు ఓటు వేసేలా పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు నిర్మిస్తోంది. కేంద్రాలకు వచ్చిన వారిని లోపలికి తీసుకెళ్లేలా ట్రై సైకిల్స్‌ను ఏర్పాటు చేస్తోంది. వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చేలా ప్రత్యేక వాహనాలను సైతం ఏర్పాటు చేస్తోంది. అయినప్పటికీ మంచానికే పరిమితమైన దివ్యాంగులు, వయోవృద్ధులు ఇప్పటికీ ఓటింగ్‌కు దూరంగానే ఉంటున్నారు. ఇలాంటి వారు కూడా ఓటును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో నూతన విధానం అమలు చేస్తోంది.

ఇంటి వద్దనే ఓటు వినియోగం

దివ్యాంగులు, వయోవృద్ధులు బయటకు వచ్చి ఓటు వినియోగానికి ఇబ్బందులు పడకుండా నేరుగా వారి వద్దకే ఎన్నికల సిబ్బందిని ఈవీఎంతో సహా పంపించే ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానం విజయవంతం కావడంతో త్వరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ దాన్ని అమలు చేయాలని ఈసీ నిర్ణయించింది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలపై కసరత్తు చేస్తోంది. ఈసీ నిర్దేశించిన ఈవీఎంతో కూడిన ప్రత్యేక వాహనం నేరుగా దివ్యాంగులు, వయోవృద్ధులైన ఓటర్ల ఇంటి వద్దకే వెళ్తుంది. పోలీస్ బందోబస్తుతో కూడిన ఈ వాహనంలో ఎన్నికల సిబ్బంది ఈవీఎంలో వీడియో చిత్రీకరణ ద్వారా ఓటు వేయించనున్నారు. దీంతో తాము ఉన్న చోటు నుంచే ఓటుహక్కు వినియోగించుకునే వెసులుబాటు కలగనుంది.

పోలింగ్‌శాతం పెంపే లక్ష్యం

ఎన్నికలు జరిగిన ప్రతీసారి వందశాతం పోలింగ్ నమోదు చేయాలని ఈసీ లక్ష్యంగా నిర్ణయించినా ఆచరణలో సాధ్యం కావడం లేదు. అందుకు ఇలాంటి క్షేత్రస్థాయి ఇబ్బందులున్నాయి. వాటిని దూరం చేసి ఈ ఎన్నికల్లో ప్రతీ ఓటరు ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన వయోవృద్ధులు, దివ్యాంగుల ఓటరు నమోదు పూర్తిస్థాయిలో వినియోగమయ్యేలా ఈ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. దీంతో పోలింగ్‌శాతం పెరగనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



శతాధిక ఓటరును సన్మానిస్తున్న కలెక్టర్

జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు

వయో వృద్ధులంతా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నెల 22న వయోవృద్ధులతో ఓటు వినియోగంపై అవగాహన సదస్సుతో పాటు వారితో ర్యాలీ కూడా నిర్వహించారు. నేను తప్పకుండా ఓటు వేస్తాను.. అని తెలియజేసేలా వయోవృద్ధులతో ప్రతిజ్ఞ చేయించడంతో పాటు 80ఏళ్లు పైబడిన ఓటర్లను శాలువాతో సత్కరించి ఓటు ప్రాధాన్యతను తెలియజేశారు.

జిల్లాల వారీగా దివ్యాంగులు, వయోవృద్ధులు, ఓటర్ల వివరాలు

జిల్లా	వయోవృద్ధులు	దివ్యాంగులు	మొత్తం ఓటర్లు
మంచిర్యాల	8,796	6,864	5,90,620
ఆదిలాబాద్	5,431	4,534	4,34,271
కుమురంభీం	5,100	3,900	4,31,655
నిర్మల్	9,800	8,200	6,83,848

క్లుప్తంగా

మధ్యప్రదేశ్ వెళ్లి.. అన్నయ్యకు రాఖీ కట్టి


అన్నయ్యకు రాఖీ కడుతున్న వినూత్న

కుంటాల: కుంటాలకు చెందిన రేవతి– కదార్ల హరిప్రసాద్‌ల కుమారుడు వేదాంత్ షణ్ముఖ మధ్యప్రదేశ్‌లోని జవహర్ నవోదయ విద్యాలయ శివపురి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. దీంతో చెల్లి వినూత్న 1350 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నయ్య వద్దకు తల్లితో కలిసి రైలులో వెళ్లి రాఖీ కట్టింది. అలాగే అన్నయ్య స్నేహితులకు సైతం రాఖీ కట్టడంతో వారంతా సంతోషపడ్డారు.

నేడు తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని షార్ప్‌గార్డెన్‌లో శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం, ప్రజ యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం నగేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ సభకు తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాసంఘాల నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

డిగ్రీ పరీక్షల్లో తొమ్మిది మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలోని ఎస్‌డీఎల్‌సీఈ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం జరిగిన బీకాం, బీబీఏ, బీబీఎం ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షల్లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సైన్స్ డిగ్రీ కళాశాలలో తొమ్మిది మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆటోడ్రైవర్‌పై చేసిన మరో ఆటోడ్రైవర్‌తో పాటు ఆయన బావమరుదులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటికి చెందిన షేక్ అహ్మద్ ఆటో నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఠాకూర్ హోటల్ వద్ద ఆటో స్టాండ్‌లో ఆటోను నిలిపాడు. పట్టణంలోని చిల్కూరిలక్ష్మినగర్‌కు చెందిన మరో ఆటో డ్రైవర్ షేక్ యూనుస్‌ను రూ.వంద అప్పుగా అడిగాడు. దీంతో యూనుస్ ఆయనను బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆయన బావమరుదులను పిలి పించి షేక్ అహ్మద్‌పై దాడి చేశారు. రాడ్‌తో దాడి చేయడంతో ఆయనకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

బంగారు గొలుసు చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లోని సానియా జువెల్లర్స్‌లో గురువారం సాయంత్రం బంగారు గొలుసు చోరీకి గురైంది. దుకాణం వర్కర్స్ కథనం ప్రకారం.. ఓ వ్యక్తి బంగారం కొనడానికి షాప్‌కు వచ్చాడు. సేల్స్ మేనేజర్స్ బంగారం చూపించే క్రమంలో రెండు తులాల బంగారు గొలుసును వారి కళ్లు కప్పి కాజేశాడు. దీంతో దుకాణం యజమానికి అనుమానం వచ్చి సీసీ కెమెరాలు పరిశీలించగా బంగారు గొలుసు ఎత్తుకెళ్లినట్టు కనిపించింది. దీంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్..!

- ''ఇటీవల మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బాలికను ఓ ఆకతాయి వేధిస్తున్నాడని షీ టీమ్‌కు సమాచారం అందించారు. ఆ పాఠశాల వద్దకు షీ టీమ్ పోలీసులు మఫ్టీలో వెళ్లి సదరు యువకుడిని పట్టుకున్నారు. యువకుడి కుటుంబ సభ్యులను పిలిపించి పోలీస్‌లు వారి పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించి వదిలేశారు.''
- ''మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతికి ఇన్‌స్టా గ్రామ్ ద్వారా సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడింది. కొంత కాలం తర్వాత సదరు యువతి ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫొటోలను మార్ఫింగ్ చేసి న్యూడ్ ఫొటోలు ఆమెకు పంపించి బ్లాక్ మెయిల్ చేశాడు. దీంతో సదరు మహిళ ఇంట్లో తెలిస్తే ఇబ్బంది అవుతుందని షీటీమ్‌ను ఆశ్రయించింది. వెంటనే కేసు నమోదు చేసుకొని సదరు యువకుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి పూర్తిగా ఫొటోలు డిలేట్ చేయించారు. తర్వాత యువకుడిని రిమాండ్‌కు తరలించారు. ఇలా జిల్లాలో పలు కేసులను షీటీమ్ సామరస్యంగా పరిష్కరిస్తూ మహిళలకు తోడుగా నిలుస్తోంది.''


అవగాహన కల్పిస్తున్న షీటీమ్ ఎస్సై హైమ

- భరోసా కల్పిస్తున్న షీటీమ్
- చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలి
- తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలి
- బాలికలకు స్వీయరక్షణపై షీటీమ్ శిక్షణ
- షీటీమ్‌తో బాలికలకు, మహిళలకు భరోసా

2023 జనవరి నుంచి జులై వరకు షీటీమ్ కార్యక్రమాలు

అవగాహన కార్యక్రమాలు 175
వచ్చిన పిటిషన్లు 034
కౌన్సెలింగ్ 026
నమోదైన కేసులు 08

మంచిర్యాలక్రైం: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతూ నూతన ఆవిష్కరణలతో ఆకాశమే హద్దుగా విస్తరిస్తున్న నేపథ్యంలో మానవ సంబంధాలు క్షీణిస్తున్నాయి. అన్ని రంగాల్లో మహిళలు దూసుకుపోతున్నా అసమానాతలు, అనిచివేత తప్పడం లేదు. ముక్కుపచ్చలారని చిన్నారుల నుంచి ఆరుపదుల వయసు వృద్ధుల వరకు లైంగిక వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఇటువంటి సమయంలో చిన్నారులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత కుటుంబంపై ఎంతైనా ఉంది. అలాగే పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసిన షీ టీమ్ ద్వారా సైతం విస్తృతంగా అవగాహన కల్పిస్తూ తోడుగా నిలుస్తున్నారు.

అవగాహన పెంచాలి..

బాలికపై అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు పెచ్చుమీరుతున్న నేపథ్యంలో కుటుంబాల్లో బాలికలకు తమ జీవన శైలిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. కుటుంబ బాంధవ్యాల్లో ప్రేమ, ఆప్యాయతలతో కూడిన స్పర్శకు, చెడు స్పర్శకు కలిగే తేడాను పసిగట్టే విధంగా బాలికల్లో అవగాహన పెంచాలని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

చైతన్యవంతం చేయాలి...



బాలికలకు చిన్నతనం నుంచే ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వం పెంచాలి. వయసును దృష్టిలో ఉంచుకొని స్పర్శ సంబంధిత విషయాలపై అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనలో మార్పులు, ఒత్తిళ్లను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేలా చైతన్యవంతం చేయాలి.

– విశ్వేశ్వర్‌రావ్, మానసిక వైద్యనిపుణుడు, మంచిర్యాల

ఫిర్యాదు చేసేందుకు భయపడొద్దు



సమాజంలో ఎదురయ్యే విపత్కర పరిస్థితుల్లో తక్షణమే ఫిర్యాదు చేసేందుకు బాలికలు ఏ మాత్రం భయపడకూడదు. ఇళ్లు, కాలేజీ, స్కూల్, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడైనా ఇబ్బంది కలిగితే పోలీసులను సంప్రదించాలి. న్యాయం జరిగే వరకూ పోరాటం చేసే తెగువ అమ్మాయిల్లో రావాలి. ఇంటి నుంచే బాలికలను ధైర్యంగా తీర్చిదిద్దేందుకు కుటుంబ సభ్యులు శ్రీకారం చుట్టాలి.

– సుధీర్ రాంనాథ్ కేకన్, డీసీపీ, మంచిర్యాల

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళల భద్రతకు షీటీమ్‌పై విద్యార్థులకు, మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. వారి పేర్లు గోప్యంగా ఉంచబడుతాయి. యువతులు ఇన్‌స్టాగ్రామ్‌లో అయిన పరిచయాలతో మోసపోతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు పెట్టుకోకపోవడం మంచిది. – హైమ, ఎస్సై, షీటీమ్ జిల్లా ఇన్‌చార్జి, మంచిర్యాల

కోర్టు భవన నిర్మాణ పనులు పరిశీలించిన జడ్జి


భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

బెల్లంపల్లి: బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు భవన నిర్మాణ పనులను గురువారం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావు పరిశీలించారు. మంచిర్యాల సబ్ జడ్జి ఉదయ్‌కుమార్, బెల్లంపల్లి జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి ముఖేష్‌తో కలిసి భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఇప్పటికే భవన నిర్మాణ పనులు కాస్తా ఆలస్యం కాగా ఇక ఏమాత్రం జాప్యం చేయకుండా సత్వరమే పూర్తి చేయాలని ఆర్ అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కొత్తగా నిర్మాణం చేస్తున్న కోర్టు భవనంలోని విభాగాలకు, ప్రత్యేకించి పోలీసులకు ఓ గదిని ఏర్పాటు చేయాలని సూచించారు. సెప్టెంబర్ 9న జరిగే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా న్యాయమూర్తి వెంట బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్ప మనోహర్, కార్యదర్శి సింగతి రాజేష్, న్యాయవాదులు గోపికిషన్‌సింగ్, ఎల్.రాము, అశోక్, చేను రవికుమార్, శ్రీనివాస్ ఉన్నారు.

మతంతో సంబంధం లేని రక్షాబంధన్

నెన్నెల: మంచి మనసు ఉంటే చాలు అనుబంధానికి మతంతో సంబంధం లేదని నిరూపిస్తున్నారు మండల కేంద్రంలోని వడ్ల వాడకు చెందిన రేవెల్లి అంజలి అనే యువతి. ఇంటి పక్కనే ఉంటున్న సోదర సమానుడైన రహమాన్‌కు ఏటా రాఖీ కడుతూ మతసామరస్యాన్ని చాటుతూ అనుబంధాన్ని దేవుడిచ్చిన బంధం అని కొనసాగిస్తున్నారు. అంజలికి సోదరులు లేరు. రహమాన్‌కు సోదరీమనులు లేకపోవడంతో అక్కా, తమ్ముళ్ల లాగా కలిసి మెలిసి ఉంటున్నారు. గురువారం రాఖీ కట్టి మతంతో సంబంధం లేదని చాటిచెప్పింది.


రహమాన్‌కు రాఖీ కడుతున్న అంజలి

పోగొట్టుకున్న మొబైల్ అందజేత

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నస్పూర్‌కు చెందిన బొద్దుల మహేందర్ మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీసులు కనిపెట్టి గురువారం మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా బాధితుడికి అందించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ఆధార్‌కార్డు, ఫోన్ ఐఎంఈఐ నంబర్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వెబ్‌సైట్‌లోకి లాగినై అప్‌లోడ్ చేయడం జరిగిందన్నారు. పోర్టల్ ద్వారా మొబైల్ బ్లాక్ చేసి సిమ్‌కార్డులు మార్చిన వెంటనే ట్రేస్ చేసి సమాచారం అందించడంతో వారి వివరాలను తెలుసుకుని ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లు చోరీకి గురైతే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.


ఫోన్ అందిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

పండుగ పూట విషాదం



గాయాల పాలైన లింగన్న, కళ్యాణ్


సంఘటన స్థలంలో నర్సవ్వ మృతదేహం

- మహిళ ప్రాణాలను బలిగొన్న కారు
- ఇద్దరికి తీవ్ర గాయాలు

నేరడిగొండ: పండగపూట విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వివరాల్లోకి వెళితే.. బోథ్ మండలం కన్నుట్ట గ్రామానికి చెందిన భార్యాభర్తలు నల్ల లింగన్న, నర్సవ్వ(38) నిర్మల్‌లోని మంజులాపూర్‌లో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం వారి స్వగ్రామమైన కన్నుట్టకు రాఖీ పండగ నిమిత్తం వచ్చారు. గురువారం లింగన్న, నర్సవ్వతో పాటు లింగన్న తమ్ముడు కళ్యాణ్‌లు ద్విచక్ర వాహనంపై మంజులాపూర్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలోని జాతీయ రహదారి వద్ద కారు యూటర్న్ తీసుకోగా వెనుక నుంచి బైక్ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో నర్సవ్వ అక్కడికక్కడే మృతిచెందింది. లింగన్న, కళ్యాణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్‌లో తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఓ ప్రైవేట్ వాహనంలో బోథ్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలీ పనుల కోసం ఎనిమిది నెలల క్రితం గ్రామానికి దూరంగా వెళ్లిన వీరు పండగ పూట వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో సిబ్బంది

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లలితాకుమారి తెలిపారు. పాఠశాలకు చెందిన శాలిని, స్ఫూర్తి, స్నేహ, స్వాతి, లక్ష్మిప్రసన్నలు మహారాష్ట్రలోని సాంగ్విలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నిర్వహించే క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు క్రీడాకారులను అభినందించారు.

హోంగార్డుకు ఆత్మీయ వీడ్కోలు



హోంగార్డ్‌ను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ వీరన్న

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందుతున్న హోంగార్డు సిందే బలరాంకు గురువారం జిల్లా పోలీస్‌శాఖ తరపున ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎస్పీ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు 40 ఏళ్లుగా భైంసా యూనిట్‌లో హోంగార్డుగా పని చేసిన బలరాంను అదనపు ఎస్పీ వీరన్న పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో, ట్రాఫిక్ నియంత్రణ, బ్లూ కోర్టు, పెట్రోల్ కార్ డ్రైవర్లు, కార్యాలయాల భద్రత, రాత్రి గస్తీ, బందోబస్త్‌లో హోంగార్డుల పాత్ర కీలకమని కొనియాడారు. హోంగార్డులు ఎలాంటి సమస్యలున్నా ఆర్‌ఐ హోంగార్డ్ ద్వారా తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ ఆర్‌ఐ రామకృష్ణ, ఆర్‌ఐ రాంనిరంజన్, యంటీఓ వినోద్, దేవరావు, హోంగార్డు కుటుంబ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో పనులకు ఆమోదం

భైంసాటౌన్: భైంసా పట్టణంలో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ పాలకవర్గం ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ సబియాబేగం అధ్యక్షతన గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఏడు అంశాలతో కూడిన ఎజెండాపై సభ్యులు చర్చించారు. వివిధ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సభ్యులు ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ స్థలంలో నిర్మించిన దుకాణాల కేటాయింపునకు బహిరంగ వేలం పాట నిర్వహించాలని నిర్ణయించారు. ఆస్తి పన్నుల వసూలకు అవసరమైన యంత్రాలు, నర్సింహనగర్ బుద్ధవిహార్ వద్ద శ్మశాన వాటికకు రూ.30 లక్షలతో ప్రహరీ, సీసీ రోడ్డు, గట్టు మైసమ్మ ఆలయం వద్ద రూ.ఐదు లక్షలతో సీసీ రోడ్డు, ఐబీ చౌరస్తా నుంచి పులేనగర్ సుభద్రవాటిక శిశుమందిర్ వరకు రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, ఒకటో వార్డులోని నేతాజీ నగర్‌లో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.20లక్షలతో పనులకు ఆమోదం తెలిపారు. అలాగే వినాయక ఉత్సవాల ఏర్పాట్లకు రూ.20లక్షలు, పోలాల అమావాస్య పండుగకు రూ.లక్షతో పనులకు ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్, కమిషనర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

యాసిడ్ పడి ఇద్దరికి గాయాలు


యాసిడ్ పడడంతో ముఖంపై గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: ప్రమాదవశాత్తు యాసిడ్ పడడంతో ఇద్దరు యువకులకు గాయాలైన ఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వినయ్ అనే వ్యక్తి తన నగల దుకాణానికి యాసిడ్ బాటిల్‌ను తీసుకెళ్తుండగా బైక్‌పై వెళ్తున్న అతీఖ్ అహ్మద్ అనే యువకుడు వినయ్‌ను ఢీకొట్టాడు. దీంతో అతడి చేతిలోని యాసిడ్ బాటిల్ పగిలి ఆ ఇద్దరిపై పడింది. దీంతో వారి ముఖాలకు గాయాలై కమిలిపోయాయి. దీన్ని గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

గల్ఫ్‌లో ఖానాపూర్ వాసి మృతి

ఖానాపూర్: ఉపాధి కోసం దుబాయికి వెళ్లి అక్కడే అనారోగ్యంతో పట్టణంలోని ఇంద్రనగర్ చెందిన మెంగు గంగయ్య(55) గురువారం మృతి చెందాడు. దుబాయిలోని ఓ అయిల్ కంపెనీలో పనిచేస్తున్న గంగయ్యకు పది రోజుల క్రితం పక్షవాతం రావటంతో అక్కడి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు కుటుంబీకులకు అతడి స్నేహితులు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. గంగయ్య మృతితో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

డిప్యూటీ వార్డెన్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: బెల్లంపల్లి తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల(బాలికలు)లో డిప్యూటీ వార్డెన్ పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి తెలిపారు. డిగ్రీ, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు బెల్లంపల్లి కళాశాలలో లేదా జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయం మంచిర్యాలలో దరఖాస్తులు అందించాలని వివరించారు.

మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు 4న ఇంటర్వ్యూ

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నస్పూర్, శంషేర్‌నగర్, మంచిర్యాలలోని హమాలీవాడ, సాయికుంట బస్తీ దవాఖాన, ఐటీడీఏ పరిధిలోని కాసిపేట్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల కోసం ఈనెల 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఎనిమిది మంది ఆత్మహత్య

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గురువారం వేర్వేరు కారణాలతో ఎనిమిది మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పండగ పూట ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఖానాపూర్: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలోని దిలావార్‌పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ వివరాల ప్రకారం.. పానుగంటి రాజేశ్వర్ (60) తనకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. పంటసాగుకు మూడేళ్లుగా చేసిన అప్పులు తీరకపోవడంతో మనస్తాపానికి గురై తన పంట పొలంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో దూకి వివాహిత..


మల్లవ్వ (ఫైల్)

దస్తురాబాద్: అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలోని భూత్కూర్ గ్రామపంచాయతీలోని రాంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... రాంపూర్ గ్రామానికి చెందిన జంగిలి మల్లవ్వ(26) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తితో ఇంటి సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలుకు భర్త శేఖర్, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందుతాగి ఒకరు..

తలమడుగు: పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని లచ్చంపూర్ గ్రామానికి చెందిన సెడ్మకి సీతారాం(40) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కొంత కాలంగా టీబీతో బాధపడుతున్నాడు. దీంతో వ్యాధి నయం కాదేమోనని మనస్తాపంతో బుధవారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ.. గురువారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్సై ధనశ్రీ తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

దహెగాం: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఐనం గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం.. ఆత్మకూరి లక్ష్మిపతి (59) మద్యానికి బానిసై తరచు భార్యతో గొడవ పడేవాడు. అదే క్రమంలో గురువారం కూడా అతిగా మద్యం తాగి భార్యతో గొడవ పడి ఇంట్లోకి వెళ్లి దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి మృతిచెంది కనిపించాడు. మృతుడి కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ప్రకాష్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు..

వాంకిడి: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... మండలంలోని సొనపూర్ జీపీ చిచుపల్లి గ్రామానికి చెందిన అడ కృష్ణ (21) కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం సాయంత్రం మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపాడు.

అనారోగ్యంతో వృద్ధుడు...

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రసన్నంజనేయనగర్‌కు చెందిన మల్కరి నాగేశ్వర్(60) అనారోగ్యంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం... నాగేశ్వర్ మద్యానికి బానిస కావడంతో పాటు కొంత కాలంగా పైల్స్‌తో బాధ పడుతున్నాడు. బుధవారం రాత్రి పైల్ నొప్పి ఎక్కువకావడంతో మద్యం తాగిన మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులకు ఉరేసుకుని కనిపించాడు. భార్య గౌరుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాలకిషన్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు..

కెరమెరి(ఆసిఫాబాద్): మద్యం మత్తులో యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై గుంపుల విజయ్ కథనం ప్రకారం.. దేవాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ ధరంసింగ్ (22) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబీకులు ఎంతవాదించినా వినకపోవడంతో రెండు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన నిహారికతో వివాహం చేశారు. అయినా మద్యం తాగడం మానేయలేదు. బుధవారం సైతం అతిగా మద్యం తాగి రావడంతో తల్లిదండ్రులు, భార్య మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ధరంసింగ్ పురుగుల మందుతాగి కుటుంబీకులకు తెలిపాడు. దీంతో కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

జీవితంపై విరక్తితో వ్యాపారి..

నస్పూర్: మానసికంగా కృంగిపోయి జీవితంపై విరక్తితో గడ్డి మందుతాగి వ్యాపారి బలవన్మరణానికి పాల్పడిన ఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రవికుమార్ వివరాలు వెల్లడించాడు. పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్‌కు చెందిన ముత్తె మల్లేశం(55) వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఎవరితో మాట్లాడకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం బయటకి వెళ్లి పురుగుల మందు తాగి కుమారుడు శ్రావణ్‌కు ఫోన్ చేసి చెప్పాడు. శ్రావణ్ లొకేషన్ ఆధారంగా తండ్రి ఉన్న ప్రాంతానికి చేరుకుని అపస్మారక స్థితిలోని తండ్రిని మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.